క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో జలధి



ఈరగార స్వామిని జలధికి తీసుకెళ్తున్న దృశ్యం

అగళి: ఆలూడి గ్రామంలో ఈరగార స్వామి విగ్రహ ప్రతిష్టాపనలో భాగంగా శుక్రవారం జలధి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు ఉదయం ఆలయంలో కలశ పూజ, గణపతి హోమం, ఈరగార స్వామి విగ్రహనికి పంచామృతాభిషేకం చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. శనివారం స్వామి విగ్రహ ప్రతిష్టపన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఈఓ ఇంద్రాణమ్మ

పావగడ: పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని బీఈఓ ఇంద్రాణమ్మ తల్లిదండ్రులకు సూచించారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన 'మన బడి–మన బాధ్యత' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ఆంగ్ల, కన్నడ మాధ్యమాల్లో విద్యను బోధిస్తారన్నారు. మధ్యాహ్న భోజనం పథకం కింద రుచికరమైన పౌష్టికాహార భోజనం అందిస్తారన్నారు. అన్ని వసతులు ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అక్షర దాసోహ సహాయ సంచాలకుడు శంకరప్ప, ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనరసమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూరప్పకట్ట చెరువు ప్రాంతం సుందరీకరణ



సూరప్పకట్టను పరిశీలిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: స్థానిక సూరప్పకట్ట చెరువు ప్రాంతాన్ని సుందరీకరణ చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. శుక్రవారం సూరప్పకట్ట ప్రాంతాన్ని అటవీ, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ చెరువు ప్రాంతమంతా చదును చేసి, నీటితో నింపనున్నట్లు తెలిపారు. నీటిలో బోటింగ్ ఏర్పాటు చేసి, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకు సంబంధించిన వేవ్ కన్సల్టెంట్ కంపెనీతో డిజిటల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయించేలా చర్యలు చేపట్టామన్నారు. త్వరలోనే వీటిని పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, అటవీ శాఖ, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థినులు

గుడిబండ: స్థానిక ఎంజేపీ కళాశాలలో ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులు విజయవాడలో మంత్రి సవితమ్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. బైపీసీ విభాగంలో 982 మార్కులు సాధించిన ఏ.దీపికకు మంత్రి రూ.20 వేల నగదు అందించారన్నారు. అలాగే 980 మార్కులు సాధించిన టీహెచ్ లయనికు మంత్రి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందించారని తెలిపారు.

కిశోరి వికాసం–వేసవి శిక్షణ



కిశోరి బాలికలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

లేపాక్షి: మండల పరిధిలోని కల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కిశోరి వికాసం–వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణాళికా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే జ్యోతి, ఏఎన్ఎం పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు వేదవతి, మంజుళ, శివమ్మ, మంజుళమ్మ, ఆయాలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర ఉత్తిదేనా..!

- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు
- విజృంభిస్తున్న దోమలు
- రోగాల బారిన పడుతున్న గ్రామీణులు
- నిరుపయోగంగా ఫాగింగ్ మిషన్లు

రొళ్ల: కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర పేరుతో పారిశుధ్యంపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తోంది. అయితే గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది. ఫలితంగా రోగాలు ప్రబలి ప్రజలు ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలో 10 పంచాయతీలు, 41,680 జనాభా ఉంది. గ్రామాల్లో డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగునీరు రోడ్లపైన పారుతోంది. రక్షిత మంచినీటి ట్యాంకులు, కొళాయిల వద్ద పైప్‌లైన్ లీకేజీల కారణంగా మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోందని గ్రామీణులు వాపోతున్నారు.



రొళ్ల మండలం టీడీ పల్లిలో ప్రధాన రోడ్డుపై మురుగు నీరు

మూలనపడిన ఫాగింగ్ యంత్రాలు..

దోమల నిర్మూలన కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంచాయతీకి ఒకటి చొప్పున 10 ఫాగింగ్ యంత్రాలు సరఫరా చేసింది. అయితే అధికారులు వాటిని వినియోగించకుండా మూలనపెట్టేశారు. ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో దోమల బెడద అధికమైంది. దీనికి తోడు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగా చేపట్టకపోవడంతో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. ఇటీవల జీజీ హట్టి గ్రామంలో అతిసారంతో అమూల్య (11) అనే చిన్నారి మృతి చెందిన విషయం తెలిసిందే. అలాగే ఇప్పటి వరకు 38 మంది వరకు అతిసారం బారిన పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి



గ్రామంలో సీసీ రోడ్డు ఏర్పాటు చేశారే తప్ప పక్కనే డ్రైనేజీ ఏర్పాటు చేయక పోవడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపునీరు, కొళాయిల నీరు సైతం రోడ్డు మధ్యలోనే నిల్వ ఉంటోంది. పాదాచారులు వెళ్లడానికి సైతం ఇబ్బంది పడుతున్నారు. వెంటనే డ్రైనేజీ నిర్మించాలి.

– నాగరాజు, టీడీపల్లి, రొళ్ల మండలం

మేమే శుభ్రం చేసుకుంటున్నాం



డ్రైనేజీలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో మురుగునీరు నిల్వ ఉంటోంది. అధికారులకు తెలియజేసిన కూడా పట్టించుకోలేదు. మేమే మురుగుకాలువను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటున్నాం. అధికారులు స్పందించి రోడ్డుపై మురుగు నీరు లేకుండా శుభ్రం చేయించాలి.

– మంజునాథ్, బీజీ హళ్లి, రొళ్ల మండలం

రోగాలు వ్యాపించకుండా చూడాలి



గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో చెత్తా చెదారం పేరుకుపోయింది. ఏ వీధిలో చూసిన అపరిశుభ్రత తాండవిస్తోంది. దీంతో దోమల బెడద అధికమైన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించి రోగాలు వ్యాపించకుండా చూడాలి.

– నరసింహమూర్తి, గొట్టుగుర్కి, రొళ్ల మండలం



21,500 క్వింటాళ్ల విత్తన వేరుశనగకు ప్రతిపాదనలు

మడకశిర: నియోజకవర్గంలో ఖరీఫ్ కింద సాగు కోసం 21,500 క్వింటాళ్ల సబ్సిడీ విత్తన వేరుశనగకు ప్రతిపాదనలు ఏడీఏ కృష్ణమీనన్ శుక్రవారం తెలిపారు. అమరాపురం మండలానికి 5,000, అగళి 2,500, గుడిబండ 5,000, మడకశిర 5,500, రొళ్ల మండలానికి 3,500 క్వింటాళ్ల చొప్పున విత్తన కాయలకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఈనెలాఖరు నుంచి రైతులకు విత్తన కాయలను పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలో విత్తనకాయల కోసం రైతుల పేర్లు నమోదు ప్రక్రియను ప్రారంభిస్తామని వివరించారు.

శుభకార్యం

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బిక్కేనాయక్ కుమారుడి వివాహ వేడుక మిట్ల ఆంజనేయ స్వామి కల్యాణ మండపంలో నిర్వహించగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్, మాజీ మంత్రి శంకర్‌నారాయణ హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమ్మర్ ఫరూక్, మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ శ్యామల బాయి, నాయకులు సాయిరాం నాయక్, డి.సిద్దయ్య, అశ్వర్థరెడ్డి, తిరుపాల్ నాయక్, గోపాల్ నాయక్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి

అమరాపురం: గుడిబండ మండలం హిరేతుర్పి గ్రామంలో ఆదివారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టకు తరలిరావాలని హిరేతుర్పి మాదిగ కులస్తులు, మాదిగ ఉద్యోగులు కోరారు. శుక్రవారం వారు అమరాపురంలో దళిత నాయకులకు ఆహ్వానపత్రికలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల దళిత సంఘం అధ్యక్షుడు నారాయణ, వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివన్న మాట్లాడుతూ హిరేతుర్పి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు.

గుడిబండలో భారీ వర్షం

గుడిబండ: మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో వక్క తోటలు, పంట పొలాల్లో భారీగా వర్షపు నీరు నిలిచింది. గుడిబండలో 35.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాలు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత ఆపరేషన్లకు ఎంపిక

చిలమత్తూరు: ఉచిత శస్త్రచికిత్సలకు పలువురిని ఎంపిక చేశారు. ఈనెల 11న స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో యోగి నారాయణ సవా సమితి, ఆ నలుగురు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంఎస్ రామయ్య ఆసుపత్రి వైద్యులు మెడికల్ క్యాంపు నిర్వహించి, 13 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వారిని శుక్రవారం ట్రస్ట్‌ల సభ్యులు రవిశంకర్, ఎస్ఎల్వీ రమణ ఆధ్వర్యంలో బెంగళూరు రామయ్య ఆస్పత్రికి తరలించారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి మండిపడ్డారు. ఈ నెల 20న మండల కేంద్రాల్లో రైతు సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన నిరసన కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవడం లేదన్నారు. పంట పెట్టుబడికి సంబంధించి రూ.20వేలు వెంటనే రైతులు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించే పంటలకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 కూలి ఇస్తూ 200 రోజులు పని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు భాస్కర్, సత్యానారాయణ, వెంకటేష్, మాబూ, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'తిరంగ' విజయోత్సవం



మాట్లాడుతున్న ఎంపీ గోవింద కారజోళ

పావగడ: మన దేశ మహిళలు కుంకుమలు చెరిపేస్తే ఆపరేషన్ సింధూర్ ద్వారా ప్రతీకార జ్వాలలు ఎలా ఉంటాయో ప్రపంచానికి చూపించామని చిత్రదుర్గం ఎంపీ గోవింద కారజోళ తెలిపారు. స్థానిక శని మహాత్మ సర్కిల్ వద్ద శుక్రవారం నిర్వహించిన తిరంగ విజయోత్సవంలో ఆయన మాట్లాడారు. పహల్గాం ఘటనలో పాల్గొన్న పాకిస్తాన్ ఉగ్రవాదులు, ఉగ్రవాద సంస్థలను మన దేశ త్రివిధ దళాలు పూర్తిగా మట్టుబెట్టి మన దేశ శక్తిని నిరూపించాయన్నారు. స్థానిక బీజేపీ నాయకులు చేపట్టిన తిరంగ విజయోత్సవ ర్యాలీ డా బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బయల్దేరి శనిమహాత్మ సర్కిల్ వద్దకు చేరుకుంది. అనంతరం అతిథి గృహంలో ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులను వినియోగించు కోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆ తర్వాత తాలూకా సమితి కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సభలో మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, ఆర్సీ అంజినప్ప, తాలూకా బీజేపీ అధ్యక్షుడు అశోక్, డా జీ వెంకట్రామయ్య పాల్గొన్నారు.

ఆధిపత్యం కోసం కూటమి అనైతిక చర్యలు



విలేకర్లతో మాట్లాడుతున్న ఆనందరంగారెడ్డి

మడకశిర: రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల్లో ఆధిపత్యం కోసం కూటమి సర్కార్ అనైతిక చర్యలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి ఆరోపించారు. ఆయన శుక్రవారం మడకశిరలో విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల్లో కూటమి నాయకులకు బలం లేకున్నా వైఎస్సార్‌సీపీ సభ్యులను ప్రలోభాలకు గురిచేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. కదిరి, హిందూపురం, మడకశిరలో కూటమి నాయకులు అనైతికంగా వ్యవహరించి మున్సిపాలిటీలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారని విమర్శించారు. రామగిరి మండలంలో ఎంపీపీ పదవిని తమ వారికి కట్టబెట్టే క్రమంలో వైఎస్సార్‌సీపీ నేత కురుబ లింగమయ్య హత్యకు గురయ్యారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ఆధీనంలో ఉన్న పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, మండల పరిషత్‌లను కూటమి నాయకులు బలం లేకపోయినా అప్రజాస్వామికంగా వ్యవహరించి తమ పరం చేసుకున్నారని ధ్వజమెత్తారు. ఈవిషయంలో కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు జోక్యం చేసుకోవాలని కోరారు. విప్ ధిక్కరించిన సభ్యులపై వెంటనే అనర్హత వేటు వేయాలని కోరారు. విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించాలని కోరారు.

విలువైన స్థలం.. వినియోగానికి దూరం!



క్రీడా మైదానం పక్కన ఖాళీ స్థలంలో పెరిగిన ముళ్ల కంపలు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం పక్కన ఉన్న ఎంతో విలువైన స్థలం వినియోగానికి దూరంగా ఉంది. రూ.కోట్ల విలువజేసే ఈ భూమిలో ముళ్ల కంపలు విపరీతంగా పెరిగిపోయి అధ్వానంగా మారింది. అసలు ఈ స్థలం పాఠశాల క్రీడా మైదానానికి చెందినదా లేక ఇతరులదా? అనే అనుమానం రాకమానదు. అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులకు ఈ స్థలం గురించి పట్టడం లేదు. ప్రస్తుతం ఉన్న క్రీడా మైదానంలో క్రికెట్‌కు మాత్రం అనుకూలంగా ఉంది. మరో క్రీడ ఆడాలంటే స్థలం లేక క్రీడాకారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం ఊరికి దూరంగా ఉండడంతో.. అక్కడికి వెళ్లడానికి క్రీడాకారులు సుముఖత చూపడం లేదు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ స్థలాన్ని అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విలువైన ఈ స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పట్టణవాసులు కోరుతున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గోరంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



సోమందేపల్లిలో ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

పెనుకొండ: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ రెహానా మాట్లాడుతూ డెంగీ పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ర్యాలీలో వైద్య సిబ్బంది వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: గోరంట్ల కోలోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శుక్రవారం డెంగీ దినోత్సవాన్ని డాక్టర్ శృతి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఆస్పత్రి ప్రాంగణం నుండి బస్టాండ్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రమణ, వైద్యాసిబ్బంది పాల్గొన్నారు.

సోమందేపల్లి: డెంగీ బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు ఓంకార్, అయేషా తస్మిన్ సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లో మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని వారానికి ఒక సారి విధిగా డ్రై డే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ రవీంద్ర, రత్నమ్మ, సీహెచ్ఓ మనోహర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన

మడకశిరరూరల్: మండలంలోని ఈ అచ్చంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై వేసవి శిబిరం నిర్వహించారు. కిశోర బాలికలకు రక్తహీనత నివారణ, బాల్యవివాహాలు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర వాటిపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ శంకరమ్మ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే బాలికలకు వివాహాలు చేయవద్దని తల్లిదండ్రులకు వివరించారు. బాలింతలు ఆకుకూరలతో కూడిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. పరిశుభ్రత పాటించడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. పిల్లల ఆరోగ్యం పట్ల కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న వ్యాన్

సోమందేపల్లి: బెంగళూరు వైపు నుంచి అనంతపురానికి ప్రయాణికులతో వెళుతున్న టెంపో ట్రావెలర్ వాహనం శుక్రవారం ఉదయం స్థానిక 44వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీ కొంది. ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ప్రమాదంపై తమకు ఎలాంటి సమాచారం లేదని పోలీసులు పేర్కొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

రామగిరి: నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని వివిధ రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా, కర్ణాటకకు చెందిన భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ దేవతకు పూజలు జరుగుతాయి.


భక్తిశ్రద్ధలతో సంకష్ట హర చతుర్థి మహాగణపతి పూజ



మూలవిరాట్ సంకష్ణహర మహా గణపతి

హిందూపురం: పట్టణంలోని గణపతి ఆలయాల్లో శుక్రవారం సంకష్టహర చతుర్థి సందర్భంగా పూజలు జరిగాయి. పట్టణంలోని మహాగణపతి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనివాస నగర్, బెంగళూరురోడ్డులోని గణపతి ఆలయంలో ఉదయం, సాయంత్రం మూలవిరాట్ మహాగణాధిపతికి పంచమృతాభిషేకాలు చేసి, విశేషంగా వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ఆలయంలోని మూలవిరాట్‌కు పట్టువ స్త్రాలతో గరిక, పుష్పాలంకరణలు కుడుముల హారాలు, ఆకుల తోరణాలతో అలంకరణ పూజలు చేశారు. భక్తులు ఉదయం నుంచి ఉపవాస దీక్షలు చేసి, రాత్రి ఆలయానికి చేరుకుంటారు. అనంతరం సంకష్ట హర మహా గణపతికి పూజలు చేస్తారు.

రోడ్లు మరమ్మతు చేయరూ..



మణూరు ఉన్నత పాఠశాల వద్ద కోతకు గురైన రోడ్డు



సిద్దగిరి- మెళవాయి మధ్య దెబ్బతిన్న రోడ్డు

మడకశిరరూరల్: మణూరు ఉన్నత పాఠశాల సమీపంలోనూ, సిద్దగిరి– మెళవాయి రహదారుల్లో గతంలో కురిసిన వర్షాలకు వర్షపు నీరు రోడ్లపై ప్రవహించి కోతకు గురయ్యాయి. వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదం జరిగే ఆవకాశం ఉంది. మెళవాయి– సిద్దగిరి రోడ్డులో కోతకు గురైన రోడ్డు వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని వర్షాకాలంలో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా మరమ్మతు చేసి ప్రమాదాలు జరుగకుండా చూడాల్సిన ఆవసరం ఎంతైనా ఉంది.

నేటి నుంచి వెంకటేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం

పెనుకొండ: పట్టణంలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవ వేడుకలు శనివారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు శుక్రవారం తెలిపారు. ఈ నెల 17 నుంచి 22 వరకూ పూజా కార్యక్రమాలుంటాయన్నారు. 19వ తేదీ బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకోవాలన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

పెనుకొండ రూరల్: మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నారాయణ స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని 11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని కుమ్మరదొడ్డి, చెరువుగేరి, తోటగేరి, ఎగువగడ్డ, ఎస్‌కేడీ సర్కిల్, జీఐసీ కాలనీ, వజ్రాలపేట, దర్గారోడ్డు, గోనిపేట రోడ్డు, బోయగేరి ప్రాంతాల్లో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.